క్లుప్తంగా

సీపీఐ మహాసభలకు తరలివెళ్లిన బృందం



జగ్గయ్యపేట అర్బన్: ఒంగోలులో జరుగుతున్న భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) 28వ రాష్ట్ర మహాసభలకు జగ్గయ్యపేట నుంచి ఆ పార్టీ నాయకులు తరలివెళ్లారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, న్యాయవాది జూనెబోయిన శ్రీనివాసరావు, జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, మండల కార్యదర్శి మెటికల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు నంబూరి చలపతిరావు, షేక్ మీరా, రాణి, కుమారి, ఆదెమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరిసె మధు, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి షేక్ చందూ, తురకా రాంబాబు, ఫ్రాన్సిస్ వెళ్లినవారిలో ఉన్నారు.

గ్రంథాలయాధికారికి సన్మానం



కొణకంచి(పెనుగంచిప్రోలు): మండలంలోని కొణకంచి గ్రేడ్–2 గ్రంథాలయాధికారిగా పని చేస్తున్న అల్లూరు రామచంద్రుడు సాధారణ బదిలీల్లో భాగంగా నందిగామ గ్రేడ్–2 గ్రంథాలయాధికారిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఆయనను ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్ఎం ఉదయలక్ష్మి, ఉపాధ్యాయులు నరేష్, వేణు, అమృత, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



గరికపాడు(జగ్గయ్యపేట): రైతులు సేంద్రియ వ్యవసాయంపై మరింత అవగాహన పెంపొందించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ భవాని పేర్కొన్నారు. గ్రామంలోని కేవీకేలో మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శనివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులను ఎంత మేర తగ్గిస్తే ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందని చెప్పారు. దేశంలోని 14 రాష్ట్రాలలో 2023–24లో 15.14 లక్షల మెట్రిక్ టన్నుల రసాయన ఎరువుల వాడకం తగ్గించటం జరిగిందని తెలిపారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ అచ్యుతరాజు, వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా ప్రారంభం

నందిగామ టౌన్: అవిశ్రాంతంగా శ్రమిస్తేనే లక్ష్యాలను సాధించగలరని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కేవీఆర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలను అందించేందుకు మెగాజాబ్ మేళా వేదికగా నిలిచిందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, పలువురు నాయకులు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు



నందిగామ రూరల్: ఎరువులు, పురుగు మందుల దుకాణాల యజమానులు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలతో పాటు పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేసి క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఎరువుల వివరాల బోర్డులు ఏర్పాటు చేయాలని యజమానులకు సూచించారు. యూరియా, డీఏపీ నిల్వల రికార్డులను పరిశీలించారు. ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

జగ్గయ్యపేట: పట్టణంలోని పలు పురుగు మందులు, ఎరువుల దుకాణాలను శనివారం వ్యవసాయ శాఖ ఏడీఏ భవానీ తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా 30,300 ఎకరాలలో పత్తి, వరి, ఇతర పంటలు సాగు చేశారని యూరియా 1200 టన్నులు అవసరమవగా ఇప్పటి వరకు 1,485 టన్నులు ప్రైవేట్ డీలర్‌లు, రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా సరఫరా చేశామన్నారు. ఇంకా 300 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. యూరియా కొరత లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

తాంబూలం ఇచ్చి తన్నుకోమన్నట్లుగా కూటమి తీరు



పేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నాయకులు, తన్నీరు

అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ నేతల నిరసన

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఏఎంసీ పదవి విషయంలో తాంబూలం చేతికి ఇచ్చి కొట్టుకోండి అన్నట్లుగా కూటమి నాయకుల పనితీరు ఉందని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నేతలు ఆరోపించారు. ఎస్సీ మహిళకు కేటాయించిన మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని అగ్రవర్ణానికి కట్టబెట్టాలని కూటమి నాయకులు ప్రయత్నాలు చేస్తూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాలరాసే విధంగా కూటమి నాయకుల తీరుకు నిరసనగా శనివారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు నేతృత్వంలో రైతుబజారు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. జగ్గయ్యపేట మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఎస్సీలకే కేటాయించాలని, ఎస్సీలు అంటే మీకు అంత చులకనా, యార్డు చైర్మన్ విషయంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఎందుకు నోరు మెదపటంలేదు అంటూ నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా), ఎస్సీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ తీసుకొచ్చిన వైఎస్సార్ సీపీ

అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎస్సీ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయాల్లో నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం దక్కడంలేని ఆనాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ తీసుకువచ్చారని తెలిపారు. దానిలో భాగంగా 2019– 24 మధ్య జగ్గయ్యపేట మార్కెట్ యార్డు పదవి బీసీ మహిళ అయిన నేపథ్యంలో ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఎస్సీ మహిళకు రిజర్వు అవగా దానిని ఎస్సీలను కాదని తుంగలో తొక్కి అగ్రవర్ణాలకు కట్టబెట్టాలని చూడటం దారుణం అన్నారు. ఇప్పటికైనా నాయకులు పునరాలోచన చేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర చేనేత విభాగం అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర యూత్ కార్యదర్శి శివరాత్రి పృధ్వీ, పార్టీ జిల్లా కార్యదర్శి మాతంగి నాగబాబు, జిల్లా యూత్ కార్యదర్శులు బజారు సాయి, అమ్మనబోయిన గోపి, మండల ఎస్సీసెల్ మండల, పట్టణ అధ్యక్షుడు పాతకోటి ఉదయభాను, పిడమర్తి ప్రభు, పార్టీ పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్, ఎస్సీ నాయకులు గంగిపోగు రమేష్, బండి రాజు, కరిసె ఇశ్రాయేలు, గొర్రెపాటి బుల్లియ్య, దేవరశెట్టి వీరాంజనేయులు, పట్టణ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఊసవల్లి సురేష్, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి సురేష్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మన్నె అప్పారావు, పట్టణ సోషల్ మీడియా అధ్యక్షుడు సయ్యద్ బుజ్జి ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు దొరక్క కష్టాలు పడుతున్న అన్నదాతలు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, పక్కన పార్టీ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: రైతులకు యూరియా అందక అష్టకష్టాలు పడుతున్నారని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. శనివారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఏడాదిగా రైతులు అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యలు తట్టుకోలేక పలువురు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువుల కొరత తీవ్రస్థాయిలో ఉందని, ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉందని, ప్రభుత్వం స్పందించి అవసరం మేరకు ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పొలం పనులు మానుకొని ఎరువుల కోసం ప్రైవేటు మార్కెట్ల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ప్రైవేటు మార్కెట్‌లో ఎరువులు అధిక ధరలకు అమ్మడం, లేదా యూరియాకు కాంప్లెక్స్ ఎరువులు అంటగడుతున్నారని, దీంతో రైతులకు భారం అవుతోందన్నారు. ఒకపక్క సరైన సమయంలో విత్తనాలు అందించక, మరోపక్క ఎరువులు అందక, గిట్టుబాటు ధరలు లేక రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎరువుల కొరత సృష్టించిందని, బ్లాక్ మార్కెట్‌లో కొనాల్సిన దుస్థితి కల్పించిందన్నారు. రైతుల కోసం ఎక్కడికైనా వెళ్లి పోరాడతామని, కూటమి ప్రభుత్వం రైతులకు ఎరువులను అందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంప్‌లు ప్రారంభం

పెనుగంచిప్రోలు: మండలంలోని సచివాలయాల పరిధిలో శనివారం ఆధార్ క్యాంప్‌లు ప్రారంభమయ్యాయి. సుబ్బాయిగూడెం, శనగపాడు, నవాబుపేట సచివాలయాల పరిధిలో వారికి శనగపాడు గ్రామ సచివాలయంలో క్యాంప్ నిర్వహించినట్లు ఇన్‌చార్జీ ఎంపీడీఓ సిద్ధారెడ్డి తెలిపారు. ఈక్యాంప్‌లు ఈనెల 30వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. సచివాలయాల పరిధిలో పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పెండింగ్ వివరాలను సచివాలయ కార్యదర్శులు సేకరించాలని ఆదేశించామన్నారు. ఈనెల 25న అనిగండ్లపాడు- 1, అనిగండ్లపాడు-2 సచివాలయాల పరిధిలోని వారికి అనిగండ్లపాడు సచివాలయం-1లో, 26న గుమ్మడిదుర్రు, ముచ్చింతాల, శివాపురం సచివాలయాల పరిధిలోని వారికి అనిగండ్లపాడు-1 సచివాలయంలో, 28న పెనుగంచిప్రోలు-1,2, సచివాలయాలతో పాటు లింగగూడెం సచివాలయం పరిధిలోని వారికి పెనుగంచిప్రోలు సచివాలయం-3లో, 29న ముండ్లపాడు సచివాలయం పరిధిలోని వారికి ముండ్లపాడు సచివాలయంలో, 30న నవాబుపేట, కొణకంచి సచివాలయం పరిధిలోని వారికి నవాబుపేట సచివాలయంలో ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

జగ్గయ్యపేట అర్బన్: మండలంలో 21 మందికి మంజూరైన రూ.10,87,000 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే తాతయ్య శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పేట మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా నరసింహారావు, నాయకులు గద్దం హుస్సేన్, ముత్తవరపు వెంకటేష్, షేక్ నాగుల్‌మీరా పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జగ్గయ్యపేట అర్బన్: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడి ఎన్నిసార్లయినా ఉపయోగించే సంచుల వాడకాన్ని ప్రోత్సహించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. పట్టణంలో శనివారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో మానవహారం నిర్వహించారు. ఎమ్మెల్యే తాతయ్య ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తక్షణం నిలిపివేసి పర్యావరణ హితం కలిగిన ప్రత్యామ్నాయాలను స్వీకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, సీఐ పి.వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పేరం సైదేశ్వరరావు, నకిరికంటి వెంకట్, సచివాలయాలు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, కౌన్సిలర్లు, అధికారులు



మునగచర్లలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది



రామచంద్రునిపేటలో మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వ్యాధులు దరిచేరకుండా ఉండాలంటే..

నందిగామ రూరల్: ఇళ్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా ప్రాజెక్టు అధికారి షేక్ రుక్సానా పేర్కొన్నారు. మండలంలోని మునగచర్ల గ్రామంలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పరిశుభ్రత, దోమల నియంత్రణ చర్యలు, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర సాకారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలన్నారు. అపరిశుభ్ర వాతావరణం, నీటి నిల్వలున్న ప్రాంతాలలో దోమలు వ్యాప్తి చెందుతాయని, దీని వల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాల బారిన పడాల్సి వస్తుందన్నారు. మురుగు కాల్వల్లో పూడిక తీతలు, దోమల మందు పిచికారీ వంటి చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, లింగాలపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి గౌతమి, ఆరోగ్య విస్తరణాధికారి బిక్షాలు, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ వెంకట్రావమ్మ, గ్రామ కార్యదర్శి మురళి, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఏఎన్ఎం శిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, తక్కెళ్లపాడు, రామచంద్రునిపేట గ్రామాలలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాలలో ఎంపీడీవో నితిన్ పాల్గొన్నారు. రామచంద్రునిపేట గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్ ఏర్పాటును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భూచవరం వైద్యాధికారి అనిల్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో పద్మావతి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రామలింగేశ్వరరావు, ఏఈ స్వామి నాయక్, కార్యదర్శి లింగయ్య, నాగేశ్వరరావు, చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ టౌన్: పట్టణంలోని ఆయా శాఖల అధికారులు శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. చిత్రలేఖనం పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ ఏఈ ఫణి శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో పండగ జరిగేలా చూడాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో బాలకృష్ణ

నందిగామ టౌన్: వినాయక చవితి పండుగ సందర్భంగా నిర్వహించే నవరాత్రి మహోత్సవాలు, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలు శాంతియుత వాతావరణంలో జరిగేలా అధికారులు కృషి చేయాలని ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో పండుగ ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లు, పోలీస్, విద్యుత్, ఎక్సైజ్, అగ్నిమాపక, తదితర శాఖల అధికారులతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహ మండపాల వద్ద అన్ని జాగ్రత్త చర్యలు తీసుకునేలా ఉత్సవ కమిటీలకు సూచనలు చేయాలన్నారు. ముఖ్యంగా నిమజ్జన ప్రాంతాలలో అధికారులు అప్రమత్తంగా ఉండి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవటం, హైడెసిబుల్ సౌండ్ సిస్టమ్ వాడకుండా, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు, అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జన ఉరేగింపులలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని ఆయా శాఖాధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సీఐ వైవీఎల్ నాయుడు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి



పెనుగంచిప్రోలులో ప్రకాశం పంతులు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గాంధీ



టంగుటూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీవో బాలకృష్ణ

పెనుగంచిప్రోలు: ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఎంపీపీ మార్కపూడి గాంధీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ టంగుటూరిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన ధైర్యాన్ని మననం చేసుకోవాలన్నారు. కార్యాలయ ఇన్‌చార్జి ఎంపీడీఓ సిద్ధారెడ్డి, డెప్యూటీ ఎంపీడీఓ కె.సుబ్బారావు, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ధనిశెట్టి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామ టౌన్: స్వాతంత్ర్య పోరాటంలో టంగుటూరి ప్రకాశం పంతులు అందించిన సేవలు మరువలేనివని ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆంధ్రకేసరి, రాష్ట్ర తొలిముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టంగుటూరి చూపిన మార్గంలో నడుచుకుంటూ ప్రజా సేవలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఐసీటీ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో సయింట్ ఫౌండేషన్ సహకారంతో ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీ వంశీకిరణ్ శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐసీటీ అకాడమి కోఆర్డినేటర్ డాక్టర్ జీ సాయి చైతన్యకుమార్ మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. సయింట్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ పీ సుధాకర్, కళాశాల సీఈఓ డి.పాండు రంగారావు, మేనేజ్‌మెంట్ మెంబర్ ఎం.సుహాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రావణ మాస ఉత్సవాలు



సత్యమ్మ అమ్మవారు

నందిగామ రూరల్: మండలంలోని ఆయా గ్రామాలల్లోని దేవీ ఆలయాలలో శ్రావణ మాస ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శ్రావణమాసం అమావాస్య సందర్భంగా శనివారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. మండలంలోని పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞానసరస్వతీ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు, మూలమంత్ర హోమాది క్రతువులు నిర్వహించారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో వాసవీ మాతకు అష్టోత్తర సహస్రనామ పూజలు, శ్రీచక్రనవవర్ణ నార్చన, సామూహిక కుంకుమార్చనలు, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం చేశారు. మరిడీ మహాలక్ష్మి, మాగల్లు గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

డీఎస్సీలో ప్రతిభ చూపిన అభ్యర్థులు



శెట్టిపోగు సురేష్



రమ్య

పెనుగంచిప్రోలు: డీఎస్సీలో మండలానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు జిల్లా స్థాయిలో మంచి ర్యాంక్‌లు సాధించారు. మండలంలోని గుమ్మడిదుర్రు గ్రామానికి చెందిన శెట్టిపోగు సురేష్ ఎస్సీ రిజర్వేషన్‌లో బయాలజీ సబ్జెక్టుతో స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించాడు. మండలంలోని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన మాలావత్ శ్రీనివాసరావు, లలితల పెద్ద కుమార్తె రమ్య పీఈటీ విభాగంలో ఓపెన్ కేటగిరిలో ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా జిల్లాలో 19వ ర్యాంక్ సాధించింది.

8వ ర్యాంకు సాధించిన సాహితి



సాహితి

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని వాగ్దేవి మహిళా కళాశాల విద్యార్థిని వి.సాహితి 8వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా శనివారం వాగ్దేవి మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేష్, కరస్పాండెంట్ సరిత, అధ్యాపక బృందం సాహితిని అభినందించారు.

డీఎస్సీకి ఆరుగురు ఎంపిక

జగ్గయ్యపేట: మండలంలో శనివారం ప్రభుత్వం జారీ చేసిన డీఎస్సీ ఫలితాలలో ఆరుగురు అభ్యర్థులు ఎంపికయ్యారు. గండ్రాయి గ్రామానికి చెందిన తల్లా అనురాధ, షేక్ అజీత్‌మియా, గుగులోతు కళ్యాణ చక్రవర్తి వ్యాయామ విభాగంలో ఉత్తీర్ణులవగా షేర్‌మహ్మద్‌పేటకు చెందిన షేక్ ఫయా ఉద్దీన్, కాకనబోయిన బాలకృష్ణ, బూదవాడ గ్రామానికి చెందిన ఆవుల సంధ్యలు ఎంపికయ్యారు.

ప్రభుత్వ తీరుపై ఆటోడ్రైవర్ల నిరసన



నందిగామలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో కార్మికులు

నందిగామ రూరల్: వాహనమిత్ర పథకం ద్వారా ఆటో కార్మికులకు రూ.25 వేల ఆర్థిక సహకారాన్ని అందించి ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి కటారపు గోపాల్ పేర్కొన్నారు. ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని మధిర రోడ్డు ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్‌లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఆటో కార్మికులను ఆదుకునేందుకు కనీస చర్యలు తీసుకోవటం లేదన్నారు. అధిక పెనాల్టీలు వేసే జీవో నంబరు 21ను రద్దు చేస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు, వాహన మిత్ర, తదితర హామీలను గుప్పించారన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆటో కార్మికులను పట్టించుకున్న దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి ఒక్క హామీని అమలు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, బాబు, ఖాశీం వెంకటరత్నం, గోపి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత సమస్య పరిష్కరించాలి



నందిగామ రూరల్: జిల్లాలో రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, ఎరువులకు ఇచ్చే రాయితీ తగ్గించే కుట్రలో భాగంగానే యూరియా కొరత ఏర్పడిందన్నారు. ఎరువుల దుకాణదారులు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కొన్ని ప్రాంతాలలో యూరియా కట్ట కావాలంటే రూ.500 విలువ చేసే గుళికలు కొనుగోలు చేయాలని, కొన్ని చోట్ల కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా విక్రయిస్తామంటూ రైతులను ఇబ్బంది పెట్టే దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి యూరియా కొరత సమస్యను పరిష్కరించటంతో పాటు ఆయా గ్రామాలలోని సొసైటీ ద్వారా రైతులకు యూరియాను సరఫరా చేయాలని కోరారు. సంఘ నాయకులు శ్రీనివాసరావు, ఏడుకొండలు, మన్నెపల్లి శ్రీనివాసరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.